క్లుప్తంగా

డీజే సౌండ్ బాక్సులు వాడితే చర్యలు

యర్రగొండపాలెం: డీజే సౌండ్ బాక్సులు వాడరాదని, వాటినుంచి వచ్చే అమిత శబ్దాలకు చిన్నపిల్లలు, గుండెజబ్బు ఉన్నవారు, వృద్ధులు అనేక సమస్యలకు గురవుతున్నారని సీఐ సీహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య బుధవారం తెలిపారు. ఈ కారణాల వలన డీజే సౌండ్ బాక్సుల వాడకాన్ని రద్దు చేస్తున్నామన్నారు. శుభకార్యక్రమాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, తిరునాళ్ల జరుపుకునే సమయాల్లో పోలీస్ అనుమతులు తీసుకోవాలని, పర్మిషన్ పొందినవారు మైకులు, ఇతర సౌండ్ బాక్సులు పరిమిత సంఖ్యలో వాడుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జీఎస్టీ 2.0పై డిబేట్

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ నాని ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0పై డిబేట్ నిర్వహించారు. విద్యార్థులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గురించి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.మల్లికార్జున క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు జీఎస్టీ 2.0పై మాట్లాడారు. ప్రథమ బహుమతి షేక్ సమీమా, ద్వితీయ బహుమతి ఎన్.పవన్‌పాల్‌రాజ్, తృతీయ బహుమతి జి.హర్షిణి అందుకున్నారు. అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విక్టోరియా, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మానసిక వైద్యురాలు పద్మావతి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కెరీర్ గైడెన్స్ మానసిక నిపుణురాలు కడెం పద్మావతి పిల్లలకు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనూష తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులో జైలు శిక్ష

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్, రాచర్లగేటు సెంటర్‌లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కె.సురేష్ తెలిపారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరు పరచగా జడ్జి భరత్‌చంద్ర వారిలో ఇద్దరికి 20 రోజుల జైలు శిక్ష, ఒకరికి 5 రోజులు, మరొకరికి ఒక రోజు జైలు శిక్షతో పాటుగా రూ.10 వేల జరిమానా విధించారని వివరించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

పొదిలి: మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో నంద్యాల–ఒంగోలు రోడ్డులోని ఓ హోటల్‌లోకి కారు దూసుకెళ్లింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. కనిగిరికి చెందిన ఓ వ్యక్తి కారును వేగంగా డ్రైవ్ చేస్తుండటంతో, అదుపు తప్పి పెద్ద మసీదు వద్ద ఉన్న ఓ హోటల్‌లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హోటల్‌లోని సామాన్లు దెబ్బతిన్నాయి. స్థానికులు గమనించి డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేమన తెలిపారు.

ప్రమాదపుటంచున వంతెనలు



ప్రమాదకరంగా తాళ్లూరు-కుంకుపాడు బ్రిడ్జి



శిథిలావస్థకు చేరిన దారంవారిపాలెం బ్రిడ్జి

- కూలడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జ్‌లతో ప్రజల బెంబేలు
- పట్టించుకోని అధికారులు

తాళ్లూరు: మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో నిర్మించిన బ్రిడ్జ్‌లు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. గతంలో వచ్చిన తుఫాన్‌కి పూర్తిగా దెబ్బతినడం, మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. మండలంలోని తాళ్లూరు–కుంకుపాడు దోర్నపు వాగు బ్రిడ్జి, తూర్పుగంగవరం–దారంవారిపాలెం ప్రధాన రహదారిలో దోర్నపు వాగుపై నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరాయి. మండల వాసులు ప్రధానంగా అధిక సంఖ్యలో సులువుగా అద్దంకి తాళ్లూరు–కుంకుపాడు మీదుగా ఈ మార్గంలోనే వెళ్తుంటారు. కోతకు గురైన ఈ బ్రిడ్జ్ పై మండల వాసులు రాకపోకలు సాగించాలంటే ప్రమాదకరంగా ఉందని భయాందోళన చెందుతున్నారు. రైతులు, పశుపోషకులు, జీవాలు తోలుకుని పొలాలకు వెళ్లే ప్రతి ఒక్కరూ నిత్యం రోజువారి పనుల రీత్యా ఈ బ్రిడ్జిపైనా రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జ్ పై నుంచి వెళ్లేటప్పుడు పెచ్చులు ఊడి పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వర్షాలకు బ్రిడ్జి కోతకు గురైంది



మండలంలో కురుస్తున్న వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహించడంతో కొంత వరకు బ్రిడ్జి కోతకు గురైంది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని సొంత నిధులతో ట్రాక్టర్లతో మట్టి తోలించాను. తాత్కాలిక పరిష్కారం లభించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

– మంచాల వెంకటేశ్వర రెడ్డి, దారంవారిపాలెం సర్పంచ్

బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది



మండల వాసులు అధిక సంఖ్యలో అద్దంకికి సులువుగా వెళ్లేందుకు ఈ బ్రిడ్జి పైనే పోతుంటారు. స్తంభాలు కూడా నేల కూలి శిథిలావస్థకు చేరింది. ప్రజలు ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– యానం గోపికృష్ణ, తాళ్లూరు

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

పెద్దారవీడు: రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సమావేశాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది సంయుక్తంగా మండలం పరిధిలో పలు గ్రామాల్లో విద్యుత్ అక్రమంగా చోరీకి గురైన 52 మందిపై కేసులు నమోదు చేసి వారికి రూ.4.60 లక్షలు ఫైన్ వేసినట్లు చెప్పారు. ఎస్ఈ మాట్లాడుతూ స్థానికంగా అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. రైతులకు విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కాపురం రూరల్, పెద్దారవీడు, దోర్నాల మండలాల సిబ్బంది 30 శాతం మంది మాత్రమే ప్రజలకు సహకరిస్తున్నారని మిగతా 70 శాతం మంది సిబ్బంది సహకారం అందించడం లేదని ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన ద్వారా వారికి కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లు ఏర్పాటు చేసుకుంటే రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు అయితే రూ.78 వేలు రాయితీ ఇస్తారని వివరించారు. అవకాశాన్ని ఇంటి యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరా ఎలా ఉంది, హెచ్చు తగ్గులు ఏమైనా వస్తుందా, పరికరాలు నాణ్యంగా ఉన్నాయా, తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కాపురం విద్యుత్‌శాఖ ఈఈ పి నాగేశ్వరరావు, డీపీఓ వింగ్ ఈఈ హైమావతి, డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెయిన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎయిర్‌ఫోర్స్ డే



ఐఏఎఫ్ ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 93వ ఎయిర్ ఫోర్స్ డేని హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అత్యాధునిక ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. గొప్ప సాంకేతికతతో ప్రపంచ దేశాల సరసన భారత్ ఎయిర్ ఫోర్స్ నిలిచిందని హెచ్‌ఎం పేర్కొన్నారు. విద్యార్థులు ఐఏఎఫ్ ఆకృతిలో కూర్చుని భారత్ మాతాకీ జై, జయహో ఐఏఎఫ్ అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మొక్కలు పంపిణీ

అర్ధవీడు: పోషణ్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగులవరం, అర్ధవీడు సెక్టారులోని అంగనువాడీ కేంద్రాలకు బుధవారం మొక్కలు పంపిణీ చేసినట్లు సీడీపీఓ కె.కుమారి తెలిపారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ఒక్కో కేంద్రానికి 5 చొప్పున మొత్తం 95 పండ్ల మొక్కలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు పోషకాహార ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మోహిద్దీన్‌పురం-2, చిన్న కందుకూరు, దొనకొండలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.

బస్టాండ్‌లో గుండెపోటుతో ఒడిశా వాసి మృతి



గుండెపోటుతో మృతి చెందిన సుదర్శనంపాల్

పెద్దదోర్నాల: ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఒడిశాకు చెందిన వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పెద్దదోర్నాలలో బుధవారం జరిగింది. వివరాల మేరకు ఒడిశాకు చెందిన ఓ వలస కుటుంబం దర్శి పట్టణంలో రంగులరాట్నం ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇటీవల రంగులరాట్నం యజమాని సుదర్శనంపాల్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో వైద్యుల సలహా మేరకు పరీక్షలు నిర్వహించుకునేందుకు భార్యతో కలిసి కర్నూలుకు బయలుదేరారు. ఈ క్రమంలో దర్శి నుంచి దోర్నాల చేరుకున్న దంపతులు కర్నూలు వెళ్లేందుకు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో వేచి ఉన్న సమయంలో సుదర్శనంపాల్ మరోమారు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో స్థానికులు కొందరు హుటాహుటిన వైద్యశాలకు తరలించి చికిత్సలు నిర్వహిస్తుండగా సుదర్శనంపాల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సుబ్బారావు

దర్శి: హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ ఐవీ సుబ్బారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఉనాతన్ అధ్యక్షతన విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ సాక్స్, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎయిడ్స్, సుఖవ్యాధులు, డ్రగ్ డీ–అడిక్షన్ గురించి వివరించారు. ప్రజలు హెచ్‌ఐవీకి గురికాకుండా చూసుకోవచ్చని, చికిత్స కన్నా నివారణ మంచిదని తెలిపారు. హెచ్‌ఐవీ కేవలం అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీ ఉన్న గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందన్నారు. హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, పరీక్షింపబడని రక్తం ద్వారా మాత్రమే సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రులలో హెచ్‌ఐవీ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే పరీక్షలు చేయించుకున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదేవిధంగా, హెచ్‌ఐవీ ఉందని నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఆర్‌టీ కేంద్రాలు, లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉన్నాయని, మందులు వాడుతూ, వైద్యుల సలహాలు పాటిస్తే ఎటువంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చని తెలిపారు. హెచ్‌ఐవీ ఉందనే కారణంతో వివక్ష చూపకూడదని, అది ఎయిడ్స్ చట్టం – 2017 ప్రకారం శిక్షార్హమైన నేరమని అన్నారు. వ్యాధిపట్ల ఎటువంటి సందేహాలు, అనుమానాలున్నా జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1097కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. కండోమ్ బాక్సు ఇబ్బందుల గురించి వివరించారు.

మిరప పంటను పరిశీలించిన ఉద్యానవన శాఖాధికారి



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి

కురిచేడు: మండలంలోని దేకనకొండ, నమస్శివాయపురం గ్రామాల్లో మండల ఉద్యానవనశాఖ ఇన్‌చార్జి అధికారిణి బి.ధనలక్ష్మి బుధవారం ఈ పంట నమోదుతో పాటు సూపర్ చెక్ రికార్డుల తనిఖీ నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పంటను డిజిటల్ క్రాప్ సర్వే తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గడువులోగా పూర్తి చేయాలని, అలా చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. రైతులంతా వారు సాగుచేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. మిరప పంటను పరిశీలించి ప్రస్తుతం మిరపలో తామర పురుగులున్నట్లు గుర్తించారు. నివారణకు నీలి రంగు అట్టలు అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బొద్దికూరపాడు వాసికి నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవిచంద్ర

తాళ్లూరు: మండలంలోని బొద్దికూరపాడు గ్రామానికి చెందిన బేతేల్ గాస్పల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ రవిచంద్రకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు లభించింది. అక్టోబర్ 5వ తేదీ ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ జి.విజయ కుమార్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ శేఖర్ లూక్ చేతుల మీదుగా మంగళవారం పాస్టర్ రవిచంద్ర అవార్డు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో చిన్న పిల్లలకు ఆత్మీయ మానసిక సామాజిక విషయాలను ఆయన బోధిస్తుంటారు. ఈ సందర్భంగా మండల వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మార్కాపురంలో పోలీసుల తనిఖీలు



మార్కాపురం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కంభం సెంటర్, దోర్నాల సెంటర్, పూలసుబ్బయ్య కాలనీ, ఎస్టేట్, ఏకలవ్య కాలనీ తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు సోదాలు చేపట్టడంతో ప్రజలు కాస్త అయోమయానికి గురయ్యారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలను కట్టడి చేసేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్లకు ఆర్డినేషన్ అందజేత



కార్యక్రమానికి హాజరైన బిషప్‌లు, రెవరెండ్లు, పాస్టర్లు

మార్కాపురం: క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఏపీబీసీ(ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్) జిల్లా అధ్యక్షుడు జడి లాజరస్ పేర్కొన్నారు. బుధవారం మార్కాపురం టౌన్‌లోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల బిషప్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది పాస్టర్లకు ఆర్డినేషన్(హోదా) కల్పించారు. 70 మందికి వివిధ హోదాలు ప్రకటించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో బిషప్ నెహేమియా శ్రీనివాసరావు, స్టేట్ ప్రెసిడెంట్ బిషప్ వై.బాలరాజు, విశాఖ పట్నం బిషప్ ఇమానియేల్, నంద్యాల ఆర్సీ బిషప్ ఆమ్రూస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు.

వాగు పొంగితే పితలాటకం!



వాగు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పొదిలి: పొదిలి–దర్శి రోడ్డులోని పితూరు వాగు చిన్నపాటి వర్షానికే పొంగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రహదారి గుంతలమయం కావడం, పైగా నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు ఎక్కడ పడిపోతామోనని ఆందోళన చెందుతున్నారు. సైలెన్సర్లలోకి నీరు చేరి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, అధికారులు స్పందించి పైపు కల్వర్టు అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలి

- డీపీఓ వెంకటేశ్వరరావు



ఉప్పలపాడులో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

పొదిలి రూరల్: స్వర్ణ పంచాయతీ హౌస్ ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌కు సంబంధించిన పాత బకాయిలు ఈ నెల చివరిలోగా వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు గ్రామాన్ని ఆయన సందర్శించి శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పన్ను బకాయిలు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. పరిసరాల పరిశుభ్రతపై అవగహన కల్పించారు. గ్రామంలో రక్షిత నీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఈఓఆర్డీ జి.శోభన్‌బాబు, సర్పంచ్ గుంటూరి ఏసోబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఓకు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

తర్లుపాడు: ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించి వేధింపులు ఆపాలని వీఓఏ(సీఐటీయూ అనుబంధం) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం తర్లుపాడు ఏపీఓ రమేష్‌బాబుకు వీఓఏలు వినతిపత్రం అందించారు. గత కొంతకాలంగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఫైవ్ జీ మొబైళ్లు అందించే వరకు ఆన్‌లైన్ వర్కులు చేయలేమని తేల్చిచెప్పారు. పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దుచేసి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి ఇంటెన్సివ్‌లు చెల్లించి, రాజకీయ వేధింపులను నియంత్రించాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వీఓఏలు కరిష్మా, పార్వతమ్మ, పిరాభి, మల్లేశ్వరి, ఎస్తేరమ్మ, చంద్రకళ, శ్రీదేవి, నాగూర్, బి.నాగమల్లేశ్వరి, శారద పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి తీవ్ర గాయాలు

- ట్రైన్ ఎక్కే సమయంలో జారిపడిన సలీమ్
- రాచర్ల మండలం సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో ప్రమాదం



తీవ్రంగా గాయపడిన సలీమ్

బేస్తవారిపేట: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడటంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన రాచర్ల మండలంలోని సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అనుమలవీడు గ్రామానికి చెందిన షేక్.సలీమ్ అనే యువకుడు రాత్రి 9:30 గంటలకు సోమిదేవిపల్లె రైల్వేస్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే కాచిగూడ ట్రైన్ ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. యువకుడికి నడుము భాగం, కాళ్ల వద్ద తీవ్రంగా గాయాలయ్యాయి. రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు సమాచారం.